క్లుప్తంగా

రేపటి వైఎస్సార్ సీపీ పోరుబాట జయప్రదం చేద్దాం



వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం

నల్లజర్ల: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27న గోపాలపురంలో నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల్లో చంద్రబాబునాయుడు ప్రభుత్వం రెండు దఫాలుగా ప్రజలపై రూ.15.50 కోట్ల అదనపు చార్జీల భారాన్ని మోపిందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ గోపాలపురంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్దకు శుక్రవారం పోరుబాటగా వెళ్లి నిరసన తెలియజేసి వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు.

ఆటకు ఆర్థిక సాయం

టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడాకారుడికి దాతల చేయూత



అన్నదేవరపేటలో అనిల్‌కుమార్‌కు రూ.50 వేల చెక్కు అందజేస్తున్న పారిశ్రామిక వేత్త జీవీ తదితరులు

తాళ్లపూడి: 'సాయం చేసి గెలిపించండి' అంటూ ఓ క్రీడాకారుడు చేసిన వేడుకోలుకు దాతలు స్పందించారు. మండలంలోని అన్నదేవరపేటకు చెందిన కొండే అనిల్‌కుమార్‌కు ప్రతిష్టాత్మక ఇండో నేపాల్ టెన్నిస్‌బాల్ క్రికెట్ సిరీస్‌లో పాల్గొనే అవకాశం లభించింది. పేదరికం కారణంగా ప్రయాణ ఖర్చులకు ఆర్థికంగా అతడు ఇబ్బంది పడుతున్నాడు. దీనిపై 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించి బుధవారం అనిల్‌కుమార్‌కు ఆర్థిక సాయం అందజేశారు. మండల యువగళం నాయకుడు, పారిశ్రామికవేత్త జీవీ ప్రసాద్, కూచిపూడి లక్ష్మణరావు, కాకర్ల సత్యేంత్ర, కూచిపూడి గణపతి తదితరులు రూ.50 వేల చెక్కును బుధవారం అనిల్‌కుమార్‌కు అందజేశారు.

'మానవత' ఆర్థిక సాయం

అలాగే మండల మానవత స్వచ్ఛంద సంస్థ రూ. 6 వేల ఆర్థి సాయాన్ని మండలశాఖ అధ్యక్షుడు అంకెం సురేష్ చేతుల మీదుగా బుధవారం అనిల్‌కుమార్‌కు అందజేశారు.

గంపెడాశతో రబీ వరిసాగు

- డివిజన్ పరిధిలో 28 వేల హెక్టార్లలో సాగు
- డెల్టాలో నాట్లు ప్రారంభం
- మెట్టలో నారుమడుల పనులు

పెరవలి: ఈ ఏడాది ఖరీఫ్‌లో గిట్టుబాటు కాని అన్నదాతలు గంపెడాశతో రబీ సాగుకు సన్నద్ధం అయ్యారు. ఖరీఫ్‌లో పంట దిగుబడులు ఎకరానికి 30 నుంచి 35 బస్తాలు మాత్రమే వచ్చాయి. దాంతో పెట్టుబడులు మాత్రమే దక్కాయి. వాతావరణం అనుకూలిస్తే రబీలో ఎకరానికి 50 నుంచి 60 బస్తాల దిగుబడులు వస్తాయని రైతులు ధీమాగా చెబుతున్నారు. ప్రస్తుతం వారు ముమ్మరంగా రబీ సాగు పనులు చేపట్టారు. మెట్ట ప్రాంతంలో ఆకుమడులు వేస్తుండగా డెల్టాలో మాత్రం అప్పుడే నాట్లు వేస్తున్నారు. డెల్టా ప్రాంతంలో ఎక్కడ చూసినా రబీ వరిసాగు పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమై ఉన్నారు. కొందరు పొలాలకు దమ్ములు చేస్తుంటే, మరికొందరు తొరాలు వేస్తుండగా, ఇంకొందరు నాట్లు వేసే పనిలో ఉన్నారు. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా రబీలో 28 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 2,980 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అంతేగాకుండా రబీ పంటకు ఎరువులు కూడా సిద్ధంగా ఉన్నాయని వారు తెలిపారు.

రబీలో పెట్టుబడులు

సాధారణంగా రబీలో వరి సాగుకు పెట్టుబడి ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకూ అవుతుంది. నీటి ఎద్దడి లేకుండా, వాతావరణం అనుకూలిస్తే దిగుబడులు 50 నుంచి 60 బస్తాల వరకూ రావచ్చని రైతులు లెక్కలు వేస్తున్నారు. ఇదే జరిగితే తమకు ఖరీఫ్‌లో వచ్చిన నష్టాలను అధిగమించి లాభాల బాట పడతారని చెబుతున్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 28 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తుండగా, ఒక్క నిడదవోలు నియోజకవర్గంలోనే 34 వేల ఎకరాల్లో సాగు చేట్టారు. ఇప్పటి వరకూ నియోజకవర్గంలో 30 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గంలో బోర్ల సాయంతో ముందుగా వేసిన ఆకుమడులు ఇప్పటికే తయారయ్యాయి. ఇలా ఆకుమడులు సిద్ధమైన చోట్ల రైతులు నాట్లు వేస్తున్నారు.



పిట్టల వేమవరంలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్



ఉసులుమర్రులో ఆకుమడి నుంచి వరి నారు తీస్తున్న కూలీలు

అందుబాటులో ఎరువులు

కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా రబీ పంటకు 3,600 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ప్రభుత్వం ఇప్పటికే 1,200 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేసిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సొసైటీలు, మార్క్‌ఫెడ్ ద్వారా వాటిని రైతులకు సరఫరా చేయవలసి ఉంది. ఇప్పటికే ప్రతి సొసైటీ వద్దా ఎరువులు సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో యూరియా 600 మెట్రిక్ టన్నులు, డీఏపీ, ఫాస్పేట్ వంటి ఎరువులు 600 మెట్రిక్ టన్నులు సిద్ధం చేశారు.



తీపర్రులో నాట్లు వేస్తున్న కూలీలు

చురుగ్గా రబీ పనులు



కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా రబీ వరిసాగు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. డెల్టాలో వరినాట్లు ముమ్మరంగా చేపట్టగా, మెట్టలో మాత్రం నారుమడులు వేస్తున్నారు. ఇప్పటివరకూ డివిజన్ పరిధిలో 10 శాతం నాట్లు పూర్తయ్యాయి. నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాలలో మాత్రం 30 శాతం విస్తీర్ణంలో నాట్లు పూర్తయ్యాయి. రబీకి 3,600 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. మూడు దఫాలుగా వీటిని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. మొదటి విడతగా 1,200 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.

–పి. చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు డివిజన్

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి



కొవ్వూరులో అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్ర పటానికి బీజేపీ నాయకుల నివాళి

కొవ్వూరు: భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతిని కొవ్వూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు ఆయన చిత్ర పటం వద్ద పూలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మాట్లా ఆంజనేయులు, కో–కన్వీనర్ బీవీ ముత్యాలరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని ఉండ్రాజవరంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి బీజేపీ నేతలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ చిట్టూరి సాయిబాబా, ఆకెళ్ల శ్రీనివాసరావు, బి.షర్మిల, ఏలేశ్వరపు భాస్కరరావు, ఏలేశ్వరపు యేజ్ఞన్నారాయణ, అక్కిన శ్రీరాములు, ఎండీ రియాజ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

చాగల్లు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో గురువారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి బుధవారం తెలిపారు. 26న ఊనగట్ల, నెలటూరు, చంద్రవరం సచివాలయాల్లో, 27, 28 తేదీల్లో ఊనగట్ల, చాగల్లు–4, దారవరం గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహిస్తున్నామని ఆమె ప్రకటనలో తెలిపారు.

సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు

- మంత్రి కందుల దుర్గేష్
- నిడదవోలులో శంకుస్థాపన

నిడదవోలు: నాణ్యత పాటిస్తూ సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రహదారులన్నింటినీ గుంతలు లేని రోడ్లుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. 'గుంతల రహిత ఆంధ్రప్రదేశ్'లో భాగంగా పట్టణంలోని బీటీ, సీసీ రోడ్ల మరమ్మతులకు చర్చిపేటలో బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.45 లక్షల వ్యయంతో పట్టణంలోని రోడ్ల గుంతలు పూడుస్తారు. మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా పొక్లెయిన్ నడుపుతూ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి ఇప్పటికే నియోజకవర్గానికి రూ. 11 కోట్ల నిధులు తీసుకొచ్చామన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కమిషనర్ టి.కృష్ణవేణి, డీఈ హరిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

వాజ్‌పేయికి నివాళి

నాలుగు, ఆరు లైన్ల జాతీయ రహదారులు, ఆర్వోబీలకు ఆద్యుడు మాజీ ప్రధాని వాజ్ పేయి అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. వాజ్ పేయి శత జయంతి సందర్భంగా స్థానిక చర్ల సుశీల వృద్ధాశ్రమంలో పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఆయన చిత్ర పటానికి మంత్రి దుర్గేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో మంత్రి పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

వికలాంగురాలికి ట్రై సైకిల్

నల్లజర్ల: అనంతపల్లికి చెందిన గున్నేపల్లి హిమ సాయిశ్రీ పూర్తి వికలాంగురాలు. సాయిశ్రీ పరిస్థితిని చూసి స్పందించిన మానవత సంస్థ మండల శాఖ ఆమెకు రూ.6,300 ఖరీదైన ట్రై సైకిల్‌ను బుధవారం బహూకరించింది. కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, భోగవల్లి వెంకటసుబ్బారావు, గుళ్లపూడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

'మానవత'కు రూ.25 వేల విరాళం

నల్లజర్లకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నెక్కలపూడి ప్రతాప్ తన మనవడు నిహాన్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మానవత సంస్థ మండల శాఖకు రూ.25 వేలు విరాళంగా అందజేశారు.

క్షతగాత్రులను ఆదుకోవాలని వినతి

కొవ్వూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బల్లిపాడుకు చెందిన చదలవాడ రామారావు, అతని కుమారుడు శ్రీకాంత్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్సీ వర్గీకరణ జేఏసీ జిల్లా చైర్మన్ కొడమంచిలి రమణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రమణ బుధవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కొవ్వూరులో కలిసి వినతిపత్రం అందజేశారు. అక్టోబర్ 8న రామారావు తన కుమారుడితో కలసి మోటార్ సైకిల్ వెళుతూ పైడిమెట్ట సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో కాలు విరిగిన రామారావు మంచానికే పరిమితం కాగా, అతడి కుమారుడు శ్రీకాంత్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులిద్దరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు రమణ తెలిపారు.

పండగ రోజూ కన్నీటి ప్రార్థనలేనా?

దేవరపల్లి: పండుగ నాడూ కన్నీటి ప్రార్థనలేనా?కొత్త సంవత్సరం పూటా పస్తులు తప్పవా? అంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు వాపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాలు కోల్పోయిన ఆరోగ్యశాఖలోని హెల్త్ అసిస్టెంట్ల కుటుంబాల్లో మాత్రం కన్నీళ్ల ప్రార్థనలు మిగిలాయని వాపోతున్నారు. ప్రతి ఇంటా క్రిస్మస్ వేడుకలు ఆనందంగా జరుపుకుంటుండగా, ఉద్యోగాల నుంచి ఆకస్మికంగా తొలగించబడిన హెల్త్ అసిస్టెంట్ల కుటుంబాల్లో విషాదం నెలకొంది. క్రిస్మస్ పండగరోజు తమ పిల్లలకు కనీసం కొత్త దుస్తులు కూడా కొనలేని దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ఈ పండుగ ఏదో గడిపాం.. మరో ఐదు రోజుల్లో వచ్చే కొత్త సంవత్సరం రోజు గడిపేదెలా? అని ఉన్న ఉద్యోగం కోల్పోయి రోడ్డున పడ్డ ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేం ఏం ఖర్మ చేశాం, మా కుటుంబాలు పండగల సమయంలో కన్నీళ్లతోనే కాలం గడుపుతున్నాయని, దీనికి బాధ్యులెవరని హెల్త్ అసిస్టెంట్లు ప్రశ్నిస్తున్నారు. కోర్టు తీర్పు నెపంతో తమను అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగించి రోడ్డున పడేయడం కన్నా పాపం, శాపం ఏముంటుందని విలపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తిరిగి ఉద్యోగాలు కల్పించి తమ కుటుంబాలకు న్యాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. న్యాయం జరిగే వరకూ అలుపెరగని అభ్యర్థనా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తూనే ఉంటామని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ వెల్లడించారు.

వ్యాసరచనలో పోటీల్లో కొవ్వూరుకు బహుమతుల పంట

కొవ్వూరు: సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి సేవాసంస్థలు, విద్యా విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కొవ్వూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. విద్యార్థుల్లో మానవతా విలువలు పెంచేపొందించేందుకు సెప్టెంబర్ 27, 28, 29 తేదీల్లో ఈ పోటీలు నిర్వహించారు.కొవ్వూరు పట్టణంలోని 11 ఉన్నత పాఠశాలలు, మూడు జూనియర్ కళాశాలలు, మూడు డిగ్రీ కళాశాలలకు చెందిన 705 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వారిలో జిల్లాస్థాయి ఉన్నత పాఠశాలల విభాగంలో హోలీ ఏంజెల్స్ పాఠశాలకు చెందిన గారపాటి నేహ ప్రథమ స్థానం,(తెలుగు మాధ్యమం), జూనియర్ కళాశాలల విభాగంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన టి.యశస్వినీ శ్రీ (తెలుగు మాధ్యమం) ప్రథమ స్థానం, ఆర్. తేజస్విని (ఆంగ్ల మాధ్యమం) ద్వితీయస్థానం , డిగ్రీ కళాశాలల స్థాయిలో ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల విద్యార్థిని చోళ్ల జయశ్రీ(తెలుగు మాధ్యమం) ప్రథమ స్థానం సాధించారు. ఆకుల కుసుమ దుర్గా భవాని (ఆంగ్ల మాధ్యమం) రెండోస్థానం, వేద సంస్కృత కళాశాలకు చెందిన కె.సంతోషి (తెలుగు మాధ్యమం) రెండోస్థానం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎ.అమృత (ఆంగ్ల మాధ్యమంలో) మూడో స్థానం సాధించారు. సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బలుసు వెంకటేశ్వరరావు, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త ఎస్వీ సాయిరామ్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.



నిడదవోలు మెంటే సుందరరావు మెమోరియల్ సెయింట్ జాన్స్ టౌన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న చైర్ పర్సన్ దయా రాజగిరి



చీపురుగూడెం విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న పాస్టర్ మరపట్ల జ్యోజి



ఉండ్రాజవరంలోని క్రీస్తు లూథరన్ చర్చి వద్ద క్యారెల్స్ కార్యక్రమంలో చిన్నారులు, యూత్



కొవ్వూరు లూథరన్ చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



యర్నగూడెం ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ సందేశం ఇస్తున్న ఫాదర్ దానియేలు

శుభోదయం.. క్రీస్తు జన్మదినం

- క్రైస్తవ మందిరాలు, గృహాల్లో క్రిస్మస్ వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనలు, వాక్యోపదేశాలు
- సందడి చేసిన యువత, సండే స్కూల్ విద్యార్థులు

నిడదవోలు: లోక రక్షకుడు, కరుణామయుడైన ఏసుక్రీస్తుకు క్రైస్తవులు ఘనంగా స్వాగతం పలికారు. ఏసుక్రీస్తు పుట్టిన రోజు వేడుకలను కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో బుధవారం క్రిస్మస్‌గా భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ టౌన్ చర్చిలో చైర్‌పర్సన్ మెంటే దయారాజగిరి అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రీస్తు సువార్త గీతాలు ఆలపించారు. యువత ప్రదర్శించిన క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపే నాటిక ఆకట్టుకుంది. క్రీస్తు గీతాలకు అనుగుణంగా కుమారి కె. కేథరిన్ షర్మిల చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. క్రీస్తు సువార్త గీతాలు, బైబిల్ పఠనంతో విశ్వాసులు క్రీస్తును ఆరాధించారు. దయా రాజగిరి భారీ క్రిస్మస్ కేక్ కట్ చేసి సంఘస్తులకు శుభాకాంక్షలు చెప్పారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఏటా ఇస్తున్న మెంటే రాజగిరి అచీవ్‌మెంట్ అవార్డును, నగదు బహుమతిని ఈ ఏడాది గంజి రాంతమ్‌కు ఆమె అందించారు. సంఘస్తులు పాస్టర్ రెవరెండ్ కె. కమలాకర్, బేబీ కమలాకర్ దంపతులను సత్కరించారు.

కృపాధార సెంటినరీ లూథరన్ చర్చిలో..

అలాగే పట్టణంలోని కృపాధార సెంటినరీ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బయ్యే ఆనంద్‌కుమార్ అధ్యక్షతన క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. క్రీస్తు సువార్త గీతాలకు అనుగుణంగా సండే స్కూల్ విద్యార్థులు, యువజనులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. క్రీస్తు నాటికలు అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన బ్రదర్ పి. భక్తసింగ్ ప్రసంగిస్తూ క్రీస్తు బోధనలు అనుసరించి ప్రతి ఒక్కరూ నడచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ, ఎల్‌సీసీ, డెలిగేట్స్, అల్టర్‌నేట్ డెలిగేట్స్, సంఘస్తులు, యువజనులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఆర్‌సీఎం, బెత్లేహేం, మరనాత ప్రార్థనా మందిరాలు, సెయింట్ ఆంబ్రోస్ చర్చి, సెయింట్ జాన్స్ మైనర్ సెమినరీ, క్రీస్తు సంఘం తదితర క్రైస్తవ సంఘాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నల్లజర్ల: ఏసుక్రీస్తు జననం లోకానికి అభయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ చర్చిలలో నిర్వహించిన ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. మండలంలోని చీపురుగూడెంలో విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ మరపట్ల జ్యోజి చిన్నారులతో కేక్ కట్ చేయించారు. పరస్పరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నల్లజర్ల క్రీస్తు దేవాలయంలో ఫాదర్ ఆంటోనీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జోసెఫ్ శాంతప్ప తదితరులు పాల్గొన్నారు. పోతవరంలో పాస్టర్ రాజేష్ ఆధ్వర్యంలోను, అనంతపల్లి ఈసీఎఫ్ చర్చిలో పాస్టరు జొన్నకూటి నోవాక్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.

నిడదవోలు రూరల్: జగద్రక్షకుడైన ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను మండలంలోని ప్రార్థనా మందిరాల్లో, క్రైస్తవుల ఇళ్లల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని సమిశ్రగూడెం, మునిపల్లి, కలవచర్ల, పురుషోత్తపల్లి, కోరుమామిడి, తాడిమళ్ల, శెట్టిపేట తదితర గ్రామాల్లోని జీడీఎం, బ్రదరన్, బైబిల్ మిషన్, పెంతుకోస్తు, ఆర్సీఎం చర్చిల్లో క్రిస్మస్ ఆరాధనలు జరిపారు. దైవజనులు క్రీస్తుమార్గమే శాంతి సందేశమని ప్రసంగించారు. చిన్నారుల క్రిస్మస్ నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలు చర్చిల్లో ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక క్రీస్తు లూథరన్ చర్చి వద్ద విశ్వాసులు 'క్రీస్తు నేడు పుట్టెను హల్లెలూయ' అంటూ నినాదాలు చేశారు. పలు గ్రామాల్లోని జీడీఎం, సెయింట్ ఆంబ్రోస్, బైబిల్ మిషన్, పెంతెకోస్తు, ఆర్‌సీఎం, ఐబీఎం షారోన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు జననం గురించి పలువురు పాస్టర్లు సందేశాలు ఇచ్చారు. క్రిస్మస్ కేకులు కట్ చేశారు. క్రీస్తు జననం గురించి పాటలు పాడారు. క్రిస్మస్ క్యాండిల్స్ వెలిగించారు.

దేవరపల్లి: యర్నగూడెం ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న విచారణకర్త రెవరెండ్ ఫాదర్ దానియేలు మాట్లాడుతూ క్రీస్తు చూపించిన ప్రేమ, సేవా మార్గంలో నడవాలన్నారు. ఈ వేడుకల్లో కురుకూరు సెమినార్ రెవరెండ్ ఫాదర్ బాల జోసెఫ్, జోసెఫ్ స్కూలు కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ సజీ థామస్, యర్నగూడెం, సంఘాయగూడెం, కృష్ణంపాలెం, చిన్నాయగూడెం, గాంధీనగరం సంఘస్తులు పాల్గొన్నారు. రామన్నపాలెం వద్ద గల పునీత ఆర్‌సీఎం దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జార్జి గంటేడి ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

చాగల్లు: స్థానిక సెయింట్ లూథరన్, జీడీఎం, పెంతెకోస్తు చర్చిలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సంఘకాపరులు క్రీస్తు జన్మదిన ప్రాముఖ్యత గురించి వివరించారు. రేడియో రూమ్ వద్ద నవోదయ యూత్ ఆధ్వర్యంలో 46వ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నెలటూరు చర్చిల్లో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ సతీష్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. విశ్వాసులు బుధవారం ఉదయం వీధుల్లో తిరుగుతూ ప్రత్యేక గీతాలు ఆలపించారు. నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. ఊనగట్ల కొత్తపేటలో యూత్ చర్చి ఆధ్వర్యంలోను, బ్రాహ్మణగూడెం ఇందిరా కాలనీలోని ప్రార్థనా మందిరంలోను క్రిస్మస్ వేడుకలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్ డాక్టర్‌బాబు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. బ్రాహ్మణగూడెం, గౌరిపల్లి, చంద్రవరం, మార్కొండపాడు, దారవరం, చిక్కాల గ్రామాల చర్చిల్లో, ప్రధాన వీధుల్లో క్రిస్మస్ జరుపుకున్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత ఆలయంలో ఫాదర్ టి. జాన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మేరీమాత ఆలయాన్ని వివిధ రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే స్థానిక సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి వద్ద రెవరెండ్ ఫాదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పైడిమెట్టకు చెందిన ప్రత్తిపాటి నిస్సీ సాగర్, కొప్పాక లాస్యలకు రూ.1500 చొప్పున అదే గ్రామానికి చెందిన నందనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. పెద్దేవం, మలకపల్లి, ప్రక్కిలంక, పైడిమెట్ట, తాళ్లపూడి, అన్నదేవరపేటలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ప్రభువు చూపిన మార్గం అనుసరణీయం

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, దయ, శాంతిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక క్రిస్టియన్‌పేటలోని సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. అనంతరం నిర్వహించిన ప్రార్థనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పాస్టర్ జి.రాజన్‌బాబు ప్రార్థన చేశారు. యువజనులు ఏసుక్రీస్తు గీతాలు ఆలపించారు.మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, పెనుమాక జయ రాజు, సూర్యదేవర రంజిత్, మాజీ కౌన్సిలర్ బావన రాజేష్ (బెన్ని) తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిలను రంగురంగుల విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు.



నిడదవోలు కృపాధార లూథరన్ చర్చిలో ప్రార్థనకు హాజరైన విశ్వాసులు



దేవరపల్లి మండలం రామన్నపాలెం ఆర్‌సీఎం చర్చి వద్ద ఏర్పాటు చేసిన క్రీస్తు జననాన్ని తెలిపే పశువులపాక నమూనా



బ్రాహ్మణగూడెం క్రిస్మస్ వేడుకల్లో విశ్వాసులకు బహుమతుల అందజేత



పైడిమెట్టలో టెన్త్ మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతుల అందజేత